
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 23 ఫిబ్రవరి 2025



ట్రాఫిక్ టెర్రర్!



వీఐపీ కారిడార్(ఎన్‌హెచ్‌-16)లో జంక్షన్స్ జామ్

బెజవాడలో అడుగడుగునా ట్రాఫిక్ పద్మవ్యూహాలే..

- మాన్యువల్‌తో నెట్టుకొస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- వాహనాల ఇంజన్ రన్నింగ్‌లో ఉంచడంతో పెరుగుతున్న వాయు కాలుష్యం, వృథా అవుతున్న ఇంధనం
- వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తెస్తే 20 శాతం పరిష్కారం
- హైవేపై ఇష్టారాజ్యంగా ప్రైవేటు బస్సులు, ఆటోవాలాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో వాహనదారులు



రామవరప్పాడు రింగ్ వద్ద ట్రాఫిక్ జామ్

వీఐపీ కారిడార్(ఎన్‌హెచ్ - 16)లోని జంక్షన్ల వద్ద రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతోంది. నగరంలో అంతర్గత ట్రాఫిక్ అంతకంతకూ ఎక్కువ కావడంతో సిగ్నల్స్‌ను మాన్యువల్‌గా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధానం ట్రాఫిక్ పోలీసులకు సౌకర్యంగా ఉందేమో కానీ వాహనదారులకు మాత్రం చుక్కలు చూపిస్తోంది. ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తారో తెలియక వాహనాలను రన్నింగ్ మోడ్‌లోనే ఉంచాల్సి వస్తోంది. ఫలితంగా జంక్షన్ల దగ్గర వాయు కాలుష్యం పెరగడంతో పాటు వాహనాలకు వృథాగా ఇంధనం ఖర్చవుతోంది. వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడం, ఇన్నర్ రింగు రోడ్డు పనులు మొదలు పెట్టడం దీనికి పరిష్కారంగా కనిస్తోంది. ఆటో నగర్‌లోకి వాహనాలను నగరం వెలుపల నుంచి అనుమతించడం, హైవేపై పార్కింగ్ చేసే వాహనాలపై చర్యలు తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. కుటుంబంలో ఎంత మంది ఉంటే అన్ని ద్విచక్రవాహనాలు ఉంటున్నాయి. కార్లను వినియోగిస్తున్న వారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఆర్థిక స్థోమత కలిగిన వారి ఇళ్లలో కార్ల సంఖ్య కూడా ఎక్కువే. నగరంలో పరిమితికి మించి తిరుగుతున్న ఆటోలు, ఇతర రవాణా వాహనాలు, లారీలు, భారీ వాహనాల ప్రవేశం వల్ల అంతులేని రద్దీ ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో వీఐపీ కారిడార్ (ఎన్‌హెచ్-16)లో ప్రధానంగా బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ జంక్షన్, ప్రభుత్వాస్పత్రి జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, శక్తి కల్యాణ మండపం జంక్షన్‌లు ట్రాఫిక్‌తో అట్టుడికిపోతున్నాయి. వాహనదారులకు నిత్యం నరకంగా మారుతోంది.

వృథా అవుతున్న సమయం

శివారు గ్రామాల నుంచి విజయవాడ రావటానికి పావుగంట పడితే.. ఈ జంక్షన్ల మీదుగా నగరంలోకి ప్రవేశించడానికి కనిష్ఠంగా అర్ధగంట, గరిష్ఠంగా ముప్పావుగంటకుపైగా సమయం పడుతుంది. నగరంలోని వారికైతే కనిష్ఠంగా 20 నిమిషాల నుంచి గరిష్ఠంగా అర్ధగంటకు పైగా పడుతోంది. జంక్షన్ల దగ్గరే పావు గంట వరకు వాహనాలను రన్నింగ్ మోడ్‌లో ఉంచాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉంటే .. కనీసం వాహనాలను ఆఫ్ మోడ్‌లో పెట్టుకోవటానికి అవకాశం ఉంటుంది. మాన్యువల్ విధానం వల్ల ఎప్పుడు వదులుతారో తెలియదు. వాహనం ఇంజిన్ ఆపితే ఒక్కసారి వదలగానే.. ఇంజిన్ స్టార్ట్ చేసి ముందుకు వెళ్లటానికి కొంత సమయం పడుతుంది. ఈ లోపు వెనుక వాహనాలు చేసే హారన్ల గోల అంతా ఇంతా కాదు. పరిస్థితి ఎలా తయారైందంటే.. వీఐపీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనదారులు చిరాకుగా, అసహనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీనివల్ల వాహనదారుల ఆరోగ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే..

వీఐపీ కారిడార్‌పై రద్దీ తగ్గించాలంటే.. తక్షణ పరిష్కారం విజయవాడ వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడం. దీని వల్ల 20 శాతం మిగతా 6లో..

కాలుష్య నగరాల్లో ప్రథమ స్థానం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన దక్షిణాది కాలుష్య నగరాల్లో విజయవాడ నగరం మొదటి స్థానంలో ఉంది. విజయవాడ నడిబొడ్డున వెళ్లే వీఐపీ కారిడార్‌పై కర్బన ఉద్గారాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. ట్రాఫిక్ పోలీసుల కోణంలో చూస్తే ట్రాఫిక్ రద్దీని తట్టుకోవటానికి వారు అనుసరిస్తున్న మాన్యువల్ విధానం కొంత వరకు మంచిదే అయినా వాహనదారులకు అది సంతృప్తికరంగా లేదు. ఇలా ఎన్నాళ్లు మాన్యువల్‌గా నిర్వహిస్తారు, దీనికి పరిష్కారం ఏమిటన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది.



క్వారీ తవ్విన భూమిలో అక్రమణదారులు సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్

క్వారీ భూముల్లో డ్రాగన్స్

బాపులపాడు మండలంలో వంశీ అనుచరుల భూదందాలు

- కొండల్లో అక్రమంగా తవ్వకాలు..ఆపై చదును చేసి పంటల సాగు
- క్వారీ గోతుల్లోని నీటితో మొక్కజొన్న, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మతోటల పెంపకం
- సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ నేతలపై భౌతిక దాడులు
- ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న వంశీ గ్యాంగ్ బహుళ ప్రయోజన అరాచకాలు

బాపులపాడు మండలంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ గ్యాంగ్ చేసిన అరాచకాలు చూస్తే నివ్వెరపోవాల్సిందే. ప్రభుత్వ భూములు, పేదలు సాగు చేసుకునే పొలాలను దౌర్జన్యంగా ఆక్రమించి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేశారు. ఆ తర్వాత ఆ భూములను చదును చేసి డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న, నిమ్మతోటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతో బినామీ పేర్లతో పట్టాలు పుట్టించి పాసుపుస్తకాలను పొందారు. వాటిని స్థానిక సహకార సంఘాల్లో చూపి రుణాలు సైతం తీసుకున్నారు. వైసీపీ నేతల బహుళ ప్రయోజన దందాలను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. -ఆంధ్రజ్యోతి-హనుమాన్ జంక్షన్ రూరల్

- రేమల్లె శివారులో మల్లవల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న సర్వే నంబర్ 418-8, 9ల్లోని సుమారు 22 ఎకరాల భూమిని హరిదాసులకు పట్టాలు కేటాయించారు. ఆ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు పెద్దలు భయపెట్టి ఆక్రమించుకోవడంతో పాటు 20 అడుగుల లోతు క్వారీ తవ్వి గ్రావెల్‌ను తరలించేశారు. ఈ క్వారీ గోతుల్లోని నీటితో చుట్టు పక్కల మొక్కజొన్న సాగు చేస్తున్నారు.
- పైభూమికి ఎదురుగా ఉన్న 422 సర్వే నంబరులోని 18 ఎకరాల భూమిలో అక్రమంగా తవ్వకాలు సాగించి తదనంతరం చదును చేసి డ్రాగన్ ఫ్రూట్ తోట సాగు చేస్తున్నారు. మొత్తం భూమి విలువ ఇప్పటి లెక్కల ప్రకారం సుమారు రూ.20 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారంటే ప్రభుత్వానికి ఎంత భారీ నష్టం వాటిల్లిందో అర్థమవుతోంది. అక్రమంగా తరలించిన గ్రావెల్ లెక్క వేస్తే అదే సుమారు రూ. 17కోట్ల వరకూ ఉంటుందని అంచనా. దీన్ని బట్టి ఒక్క చోట సుమారు 38 ఎకరాల్లో రూ.37 కోట్ల ప్రజాధనం పెద్దల పాలైంది.
- మల్లవల్లిలోని మూడు ఎకరాల అసైన్డ్ భూమిలో అక్రమ క్వారీయింగ్ నిర్వహించి 12 అడుగుల లోతు తవ్వేడంతో పాటు చదును చేసి నిమ్మతోట సాగు చేసుకుంటున్నారు. దీనికి స్థానికంగా ఉండే మండల స్థాయి వైసీపీ నాయకుడొకరు అండగా నిలబడటంతో ప్రజలు కూడా ఏమీ చేయలేని స్థితిలో అధికారులు వస్తే మిగతా 6లో..



జీవన సౌందర్య 'చిత్రం'

8లో

పచ్చటి ప్రకృతిలో నదీ తీరం వెంబడి పొగలు కక్కుతూ పరుగెడుతున్న రైలు బండి, చెరువులో తామరపూలతో మగువలు, పిల్లి కోసం పొంచిన పులి, హాస్య పితామహుడు చార్లీచాప్లిన్, అక్వేరియంలో గోల్డ్ ఫిష్, భయపెడుతున్న డైనోసార్స్, త్రివర్ణ పతాకాన్ని చేతబూని పరుగెత్తుతున్న బాలురు, సముద్రంలో చేపల వేటకు వెళుతున్న మత్స్యకారులు, చెట్లకు పేడ ముద్దలు కొడుతున్న మహిళ, సెలయేళ్లు, జలపాతాలు, మంచినీళ్ల బిందెలతో మగువ, కోతికి శిక్షణ ఇస్తున్న వ్యక్తి .. ఇవన్నీ కళాకారుడి ఆలోచనల నుంచి ఆవిష్కృతమైన కళాఖండాలు. బందరు రోడ్డులోని ఆకాశవాణి కేంద్రం వద్ద ప్రహరీపై కొలువుతీరాయి. జీవం ఉట్టిపడేలా ఉన్న ఈ జీవన చిత్రాలు నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సిటీకి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్న ఎంజీ రోడ్డును 'సిటీ ఆన్ ఆర్ట్స్'లో భాగంగా కార్పొరేషన్ అధికారులు కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు.

-ఆంధ్రజ్యోతి- విజయవాడ

కృష్ణానదీ తీరంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ శ్రీకాకుళం ఇసుకరేవు నుంచి నిత్యం వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. రసీదులు ఇవ్వకుండా లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తిచూడటంలేదు. దీంతో అక్రమార్కుల ఇసుక వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

ఇసుక దుమారం

శ్రీకాకుళం రేవు నుంచి అనధికారికంగా ఇసుక అక్రమ రవాణా

- రాత్రి సమయంలో వందలాది లారీల్లో ఇసుక తరలింపు
- లారీకి రూ.10 వేలు కట్టించుకుని రసీదు ఇవ్వని నిర్వాహకులు
- అటువైపు కన్నెత్తి చూడని రెవెన్యూ, పోలీస్ అధికారులు
- మచిలీపట్నంలో భారీగా ఇసుక నిల్వల గుర్తింపు



మచిలీపట్నం కాలేఖాన్‌పేట వద్ద నిల్వ ఉంచిన ఇసుక గుట్టలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఘంటసాల మండలం శ్రీకాకుళం ఇసుకరేవులో యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ వ్యాపారం చేసిన వ్యక్తుల కనుసన్నల్లోనే మళ్లీ ఈ దందా నడుస్తోంది. స్థానిక టిప్పర్ యజమానులు, ఇసుక రేవులో ఆధిపత్యం చలాయిస్తున్న కొందరు వ్యక్తులు కూడబలుక్కుని ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. స్థానికుల టిప్పర్లలో ముందుగా ఇసుకను లోడ్ చేయాలనే షరతులు పెట్టి సాధ్యమైనంత వరకు ఇసుకను తరలించుకుపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టిప్పర్లు, లారీల్లో ఇసుకను లోడ్ చేసేందుకు అనుమతి ఇవ్వకుండా పెత్తనం చలాయిస్తుండటంతో ఈ ఇసుక అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత కొన్ని రోజులుగా శ్రీకాకుళం ఇసుకరేవులో నూతన పద్ధతిని పాటిస్తున్నారు. ఇసుక లోడ్ చేసిన తర్వాత అనధికారికంగా అక్కడున్న వ్యక్తులు ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. నగదు కట్టించుకున్నట్లు రసీదులు ఇవ్వమని టిప్పర్ డ్రైవర్లు కోరితే రసీదులు లేవని, తెల్లారేసరికి ఇసుకను గమ్యస్థానాలకు చేర్చుకోవాలని మిగతా 6లో..

ఈ ఇసుకను ఏం చేస్తారో..

ఘంటసాల మండలం శ్రీకాకుళం ఇసుక రేవు నుంచి వందలాది లారీల ఇసుకను మచిలీపట్నం తరలించి గుట్టలుగా పోశారు. ఇసుక కొనుగోలు సమయంలో ధర నిర్ణయంలో తేడా వచ్చి ఇరువురు వ్యక్తులు వాదనకు దిగడంతో అక్రమ ఇసుక నిల్వలపై అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ఇసుక అక్రమ నిల్వల వ్యవహారం వెలుగుచూసింది. మచిలీపట్నం మండలం రుద్రవరంలో ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచారనే విషయంపై ఓ వ్యక్తి రెవెన్యూ, మైనింగ్ అధికారులకు 11 రోజుల రోజుల కిందట ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి ఎలాంటి అనుమతులు లేకుండా మచిలీపట్నంలోని కాలేఖాన్ పేట మునిసిపల్ హైస్కూల్ సమీపంలో, మచిలీపట్నం-అవనిగడ్డ రహదారి పక్కనే శివగంగ డ్రెయిన్ వంతెన సమీపంలో పెద్దఎత్తున ఇసుక నిల్వలను అధికారులు గుర్తించారు. ఇసుక నిల్వలకు సంబంధించిన వివరాలు కోరితే సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలు చూపలేకపోయారు. దీంతో ఇక్కడి నుంచి ఇసుకను తరలించవద్దని రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇసుకను తరలించుకుపోకుండా ఇద్దరు పోలీసులను కాపలా పెట్టారు. 11 రోజులుగా రెవెన్యూ, పోలీస్ విభాగం అధికారులు ఈ ఇసుక నిల్వలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తుండటం గమనార్హం.

ముగిసిన వీరమ్మ తిరునాళ్లు

- ప్రభబళ్లతో తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు
- మెట్టినింటికి తిరిగి బయలుదేరిన వీరమ్మ



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) ప్రభబళ్లతో అమ్మవారి సన్నిధికి వెళ్తున్న భక్తులు

6

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

- కలెక్టర్ బాలాజీ

8లో

అందుబాటులో 'జీబీఎస్' ఇంజక్షన్లు

- విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు

8లో

నేడు దుర్గగుడిలో సరస్వతీ యాగం

8లో

ముగిసిన వీరమ్మ తిరునాళ్లు



అమ్మవారికి మొక్కు తీర్చుకునేందుకు ప్రభ బండితో వెళుతున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పదిహేను రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన వీరమ్మ తిరునాళ్ల శనివారం రాత్రితో ముగిశాయి. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తిరునాళ్ల చివరిరోజున ఉదయం నుంచి రాత్రివరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి ఈనెల 8న మేళతాళాలతో వైభంగా బయలుదేరిన అమ్మవారు భక్తుల ఎదురు గండ దీపాలు అందుకుంటూ, తిరుగు గండ దీపాలు భక్తులు వెంటరాగా మరుసటి రోజున ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆలయానికి చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి తిరునాళ్లలో అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకున్నారు. చివరి రోజున పెద్ద ముఠా, కూరగాయల మార్కెట్ వర్కర్స్ వేర్వేరుగా ప్రభ బళ్లతో వేడుకగా వెళ్లి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్ర రావు ప్రభ బండ్లకు పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. భక్తుల దర్శన అనంతరం రాత్రి పొద్దుపోయాక మెట్టినింటికి చేరుకునేందుకు అమ్మవారు ఆలయం నుంచి బయలుదేరి వెళ్లారు.

కోరిన కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి

తిరునాళ్లకు సిద్ధమైన కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం





కూడలి సంగమేశ్వరస్వామి, తిరునాళ్ల సందర్భంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం

(నందిగామరూరల్-ఆంధ్రజ్యోతి): దట్టమైన అటవీ ప్రాంతం, మహర్షుల పవిత్ర జప కేంద్రం వైరా, కట్లేరు నదుల సంగమ స్థలంలో కొలువుదీరిన శ్రీపార్వతీ సమేత సంగమేశ్వరస్వామిని కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా ఉభయ రాష్ట్రాల భక్తులు కొలుస్తుంటారు. మండలంలోని దాములూరు గ్రామం వద్ద సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. మహా శివరాత్రి రోజున ఇక్కడ అత్యంత వైభవంగా తిరునాళ్ల జరుగుతుంటాయి. భారీ ప్రభల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నదీ సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. తిరునాళ్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రత్యేక బస్సులు నడుపుతాయి. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

స్థల పురాణం

దాములూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో దక్షిణ వాహినిగా ప్రవహించే వైరా, కట్లేరు నదులు కలిసే ప్రదేశంలో కశ్యపు మహాముని శివలింగ ప్రతిష్ఠ చేసి కొంత కాలం తపస్సు చేశారని స్థల పురాణం చెబుతోంది. రెండు నదులు కలిసే ప్రాంతాన్ని నదీ కూడలిగా ఆయన నామకరణం చేశారు. కశ్యపు ముని ప్రతిష్ఠించిన శివలింగానికి 17వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయం నిర్మించారు. నదుల సంగమాన ఉన్నందున స్వామికి సంగమేశ్వరస్వామిగా నామకరణంచేశారు.



వైరా, కట్లేరు నదుల పవిత్ర సంగమ ప్రాంతం

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈనెల27న నిర్వహించే ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్టీఆర్ జిల్లాలో పటిష్ఠ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇప్పటికే 224 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు(ఏపీవో)లకు రెండు దశల్లో పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చామన్నారు. నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులతో శనివారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ వి.కరుణ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో లక్ష్మీశ జిల్లాలో చేసిన ఏర్పాట్లను వివరించారు. జిల్లాలో 112 స్టేషన్లకు 112 మంది ఏపీవోలను నియమించామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున ఇతర ప్రిసైడింగ్ అధికారుల(ఓపీవో)ను నియమించినట్లు తెలిపారు. మూడు కేటగిరీలకు రిజర్వు కేటగిరీలో 90 మంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని 19 మందిని రిజర్వులో ఉంచామని తెలిపారు. విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో డిస్ట్రిబ్యూషన్స్ రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించామన్నారు. మొత్తం 224 బ్యాలెట్ బాక్సులు అవసరమని, రిజర్వుతో కలిపి 324 బాక్సులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 454 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే 24 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్(ఎఫ్ఎస్‌టీ) క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. 11 చెక్‌పోస్టులు వద్ద రెండు షిఫ్టుల్లో 22 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ) విధుల్లో ఉన్నాయని, ఏడు వీడియో సర్వైలెన్స్ టీమ్(వీఎస్‌టీ)లు పని చేస్తున్నాయని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలోను వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లను అవసరం మేరకు నియమించామన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలన బృందం అప్రమత్తతతో పని చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

మిర్చికి ధర లేక కన్నీళ్లు పెడుతున్న రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. మిర్చి మార్కెట్, కుదేలైన రైతులను ఆదుకోవడంపై చర్చించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం (ఎంఐఎస్) ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎంఐఎస్ పథకం ద్వారా మిర్చి పంట సాగు వ్యయానికి, మార్కెట్ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్రం చెల్లించనున్నది. అయితే క్షేత్రస్థాయిలో పంట వాస్తవ సాగు ఖర్చును పరిగణనలోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఎంత పకడ్బందీగా అమలు చేసినప్పటికీ ఈ పథకం వల్ల ఎలాంటి ప్రయోజనముండదని రైతాంగం కోరుతోంది.



పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలలో కల్లంలో ఆరబోసిన మిర్చి, తాలుకాయలు ఏరుతున్న కూలీలు

మిర్చి సాగు ఖర్చు క్వింటాలుకు రూ.18 వేలయితేనే ప్రయోజనం

ఎంఐఎస్ అమలులో పరిగణనలోకి తీసుకోవాలని రైతుల డిమాండ్

- కుదేలైన రైతును ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం అమలు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను కోరిన సీఎం చంద్రబాబు
- సాగు వ్యయానికి, మార్కెట్ ధరకు మధ్య వ్యత్యాసాన్ని చెల్లించేందుకు కేంద్రం అంగీకారం
- వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటేనే ఎంఐఎస్ అమలు చేసినా ప్రయోజనమంటున్నరైతాంగం

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించటం లేదు. గత ఏడాది పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. ఈ ఏడాది నల్లి ఉధృతంగా దాడి చేయటంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి పది నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తోంది. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా దిగుబడి లేక అల్లాడుతున్న రైతులు, ఆపై మార్కెట్ దెబ్బతో నిలువుగా కుంగిపోయారు. గత ఏడాది తాలుకాయలకు లభించిన ధర కూడా నేడు ఎర్రకాయలకు రావటం లేదు. పలువురు రైతులు అయినకాడికి కల్లంలోనే తెగనమ్ముకుంటూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. మార్కెట్ సంక్షోభంపై సీఎం చంద్రబాబు స్పందించటం హర్షణీయమని రైతులు అంటున్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలుకు సంబంధించి మిర్చి పంట వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ప్రచారం ఆర్భాటం తప్పితే ఈ పథకం వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడి బాగా పెరిగింది..దిగుబడి తగ్గింది



ఈ ఏడాది ఎకరానికి పెట్టుబడి రూ.రెండు లక్షలైంది. ఎర్రనల్లి, నల్లనల్లి దాడిచేయటంతో తోటలు నామరూపాలు లేకుండ కకావికలమయ్యాయి. దిగుబడి 15 క్వింటాళ్లు కూడా రావటం లేదు. కోత కూలి అసాధారణంగా పెరిగింది. కోత, గ్రేడింగ్ కలిపి క్వింటాలుకు కూలి రూ.ఐదు వేలకు తగ్గటం లేదు. ఈ స్థితిలో మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలుకు తూతూమంత్రంగా కాకుండా వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

\- కొమ్మినేని సత్యనారాయణ, రైతు, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల

ఎకరాకు సాగు ఖర్చు ఇదీ..

సగటు సాగు ఖర్చు ఎకరానికి	రూపాయల్లో
పొలం కౌలు	30,000
పొలం బాగుచేయడానికి	2,500
దుక్కి, గొర్రు	5,000
అరక గొర్రు అచ్చు	4,000
నారు	25,000
నారు ఏతకూలి	5,000
ఎరువులు	30,000
పురుగుమందులు	50,000
నీటి తడులు	10,000
కలుపు,పడిపాదులు	10,000
అంతర కృషి, ఇతర ఖర్చులు	10,000
మొత్తం ఖర్చు	**1,81,500**

- కొంత మంది రైతులకు పెట్టుబడి రూ.1,81,500 కంటే ఎక్కువే అవుతోంది. ఎకరం కౌలు రూ.40 వేలకు పైగా కూడా ఉంది. నిర్వహణ ఖర్చులు, పెట్టుబడిపై వడ్డీ కూడా పరిగణనలోకి తీసుకుంటే పెట్టుబడి రూ.రెండు లక్షలకు పైసా కూడా తగ్గదు.
- ఎకరానికి సగటున 15 క్వింటాళ్ల వంతున దిగుబడి రావటం గగనమవుతోంది. ఒకటి నుంచి రెండు క్వింటాళ్లు తాలు కాయలు ఉంటున్నాయి. అయినప్పటికీ 15 క్వింటాళ్లు, మార్కెట్ ధర రూ.13 వేల వంతున మొత్తం అమ్మకం విలువ రూ. 1.95 లక్షలవుతోంది.
- మిర్చి కోత కూలి ఎక్కువ అవుతోంది. ఒకరికి రోజుకు కూలి రూ.మూడు వందలు. ఆటో ఖర్చు రూ.30. కాయలు కోయడానికి, కల్లంలో ఆరబోసి ఎండిన తర్వాత తాలు కాయలు ఏరటానికి మొత్తం కలిపి క్వింటాలుకు రూ.ఐదు వేలు కూలి వంతున, 15 క్వింటాళ్లకు రూ. 75 వేలు కూలి అవుతోంది.
- ఈ లెక్కన సాగు వ్యయం క్వింటాలుకు రూ. 17 వేల నుంచి రూ.18 వేల లోపు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కేంద్రం అధీనంలోని ఐసీఏఆర్ క్వింటాలుకు సాగు వ్యయం రూ.10,300గా పేర్కొందని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 11,600గా నిర్ణయించింది. సాగు వ్యయాన్ని తప్పనిసరిగా రూ.18 వేలుగా పరిగణనలోకి తీసుకోవాలని మిర్చి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డాక్టర్ కృష్ణంరాజు

పవిత్రమైనది వైద్య వృత్తి

- చిరునవ్వుతో రోగులకు సేవలందించండి
- ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణంరాజు
- పిన్నమనేని సిద్ధార్థలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని చిరునవ్వుతో సేవలందించి రోగుల మన్ననలు పొందాలని ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు హైదరాబాద్ కేర్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పి.కృష్ణంరాజు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కృష్ణంరాజు విచ్చేశారు. వైద్య విద్యకు మంచి డిమాండ్ ఉందని, ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ కోర్సులు చేయాలని కృష్ణంరాజు సూచించారు. సిద్ధార్థ అకాడమీ లక్షల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిందని, ఆనాడు ఎంతో మంది మహానుభావుల దాతృత్వంతో నేడు పేద, మధ్య తరగతి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తోందని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన 142మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, నిమ్మగడ్డ లలితప్రసాద్, డాక్టర్ సీవీరావు, డాక్టర్ బి.అనిల్ కుమార్, ఏవో టీవీ సుబ్బారావు, కాసరనేని నవీన్, హిమవంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ టెర్రర్!

(5వ పేజీ తరువాయి)

వరకు ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చు. సంక్రాంతి సమయంలో పోలీసులు బైపాస్‌ను నైనవరం నుంచి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయినా విజయవాడపై రద్దీని నివారించలేని పరిస్థితి ఏర్పడింది. అయితే అదనపు ట్రాఫిక్‌ను కొంతమేర మళ్లించటానికి దోహద పడింది. అందువల్ల యుద్ధ ప్రాతిపదికన వెస్ట్ బైపాస్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే భారీ వాహనాలు, లారీలను అటుగా మళ్లించే అవకాశం ఉంది.

ఇన్నర్ రింగ్ రోడ్డు వస్తే భారీ వాహనాల తరలింపునకు అవకాశం

విజయవాడ తూర్పు బైపాస్ ప్రతిపాదనపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ ప్రాజెక్టు ఇక మీదట పట్టాలెక్కే పరిస్థితి కనిపించడం లేదు. విజయవాడ నగరంలో నెలకొన్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించటానికి విజయవాడ తూర్పు బైపాస్ ఆలోచన ప్రత్యామ్నాయంగా ఉంది. ఈ ప్రతిపాదన అర్ధంతరంగా ఆగిపోవటంతో సమస్య ఏర్పడింది. తూర్పు బైపాస్ ఎటూ లేదు.. కనీసం అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డులో భాగంగా మొదటి దశలో అయినా చోడవరం నుంచి కేసరపల్లి వరకు రోడ్డు పనులను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. కేసరపల్లి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్‌కు కలపగలిగితేనే భారీ వాహనాల సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుంది.

ఆటోనగర్‌లోకి నగరం వెలుపల నుంచి అనుమతించాలి

విజయవాడను ఆనుకుని ఉన్న ఆటోనగర్‌లోకి మొదట్లో బందరు రోడ్డులో పంటకాల్వ రోడ్డు, ఆటోనగర్ గేట్ల మీదుగా అనుమతులు ఉండేవి. దీంతో బందరు రోడ్డు ట్రాఫిక్ సమస్యలతో అతలాకుతలంగా మారింది. అనేక జిల్లాల నుంచి విజయవాడ ఆటోనగర్‌కు వచ్చే లారీల కారణంగా బందరు రోడ్డు మీద ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి. పటమట నుంచి కానూరు వరకు ప్రజలు గొడవ చేయటంతో.. అప్పటి నుంచి ఆటోనగర్‌లోకి వాహనాల డైవర్షన్ రూటు మార్చారు. ప్రస్తుత వీఐపీ కారిడార్‌లో మహానాడు రోడ్డు, శక్తి కళ్యాణ మండపం రోడ్డు, ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, మధ్యలో బల్లెం వారి వీధి, రామవరప్పాడు రింగ్ దగ్గర ఉన్న రోడ్ల నుంచి అనుమతులు ఇస్తున్నారు. దీంతో వీఐపీ కారిడార్ మీద పడుతున్న రద్దీ అంతా, ఇంతా కాదు. ఆటోనగర్ నుంచి నాలుగు రోడ్ల ద్వారా వచ్చే, పోయే వాహనాల వల్ల జాతీయ రహదారి మీద ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగా కూడా వీఐపీ కారిడార్‌పై ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.

అడ్డగోలుగా వాహనాల పార్కింగ్

వీఐపీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు ప్రధానంగా ప్రైవేటు బస్సులు, ఆటోలు కూడా కారణమవుతున్నాయి. ప్రస్తుతం వీఐపీ కారిడార్‌గా పిలుస్తున్న ఎన్‌హెచ్ - 16 కేవలం నాలుగు వరసలుగానే ఉంది. ఒక లేన్‌లో రెండు వరసలు మాత్రమే ఉంటాయి. బెంజిసర్కిల్, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు ప్రాంతాల్లో ప్రైవేటు బస్సులు హైవేపై ఒక లేనులో బారులు తీరి ఉంటాయి. దీంతో ఇక మరో ఒక లేన్ మాత్రమే మిగిలి ఉంది. ఈ లేన్‌లో క్రాసింగ్స్ ఉండటం వల్ల ఆ లేన్‌లో వాహనాలు నిదానంగా వెళతాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇవి కాకుండా ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా రోడ్ల మీద వాహనాలను నిలుపుతున్నారు. ప్రసాదంపాడు, ఎనికేపాటు, రామవరప్పాడు, విజయవాడలోని బస్టాపుల దగ్గర అడ్డగోలుగా రోడ్ల మీద వాహనాలను పెట్టడం వల్ల ఒక లేన్‌లోనే మిగిలిన వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే రమేష్ హాస్పిటల్ జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు రెండు వైపులా జాతీయ రహదారికి అనేక అంతర్గత రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ రోడ్ల మీదుగా నేరుగా జాతీయ రహదారిలోకి వాహనాల ప్రవేశం వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డు సేఫ్టీ కమిటీ కానీ, ట్రాఫిక్ అధికారులు కానీ , జిల్లా యంత్రాంగం కానీ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు నగరాన్ని స్తంభింపజేసే ప్రమాదం పొంచి ఉంది.

చిత్తశుద్ధితో పనిచేయండి

- తాగునీటి ఎద్దడి రానీయొద్దు
- పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి
- ఈ-ఆఫీస్ విధానం అమలుచేయాలి
- మునిసిపల్ అధికారులతో రాజమహేంద్రవరం ఆర్డీ నాగనరసింహారావు



మాట్లాడుతున్న నాగనరసింహారావు

నందిగామ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా, పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చూడాలని మునిసిపల్ అధికారులకు రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. శనివారం జగ్జీవన్‌రామ్ భవన్‌లో నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, కొండపల్లి మునిసిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలు, శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వేసవిలో పట్టణ ప్రజలకు పైపులైన్ల ద్వారా అందించే నీటితో పాటు ట్యాంకర్ల ద్వారానూ నీటిని అందించాలని సూచించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్న మునిసిపాలిటీలు వాటిని ప్రాసెస్ చేసుకోవాలన్నారు. అనధికార నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారని కమిషనర్లను ఆయన వివరణ కోరారు. నందిగామ మునిసిపాలిటీలో అక్రమ కట్టడాలపై ఆర్డీ విస్మయం వ్యక్తం చేశారు. నందిగామలో తొలిదశగా 54 అనధికార కట్టడాలపై చార్జిషీట్ ఫైల్ చేశామని, యజమానుల నుంచి తొమ్మిది కోట్ల రూపాయల ఆదాయం మునిసిపాలిటీకి రానుందని కమిషనర్ రమణబాబు తెలిపారు. మరో 60 భవనాలపైనా చార్జిషీటు ఫైల్ చేస్తున్నామని, మరో తొమ్మిది కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మిగిలిన మునిసిపాలిటీల్లోనూ ఇలాగే చార్జిషీట్ ఫైల్ చేసి మునిసిపాలిటీలకు ఆదాయం సమకూర్చాలని సూచించారు. టాక్స్ వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎఫ్ నిబంధనలు సడలిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయాల్లో తప్పకుండా ఈ-ఆఫీస్ విధానం అమలు చేయాలని సూచించారు. జగ్గయ్యపేట మునిసిపాలిటీకి చెందిన ఆర్ఐ, ఆర్వో, ముగ్గురు సచివాలయ అడ్మిన్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మునిసిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దుమారం

(5వ పేజీ తరువాయి)

ఉచిత సలహాలు ఇస్తున్నారు. దారిలో అధికారులు తనిఖీ చేస్తే రసీదులు చూపించాల్సి వస్తోందని డ్రైవర్లు చెబితే, శ్రీకాకుళం ఇసుకరేవు నుంచి ఇసుకను తీసుకువెళుతున్నామని చెప్పాలని, మిమ్మల్ని ఎవరూ ఆపరని చెప్పడం గమనార్హం. ఇసుక రవాణాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకున్న కొందరు వ్యక్తులు ఈ దందాను కొనసాగిస్తున్నా అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడకపోవడానికి తెరవెనుక బలమైన కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై చర్చ జరుగుతోంది.

స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లకుండానే..

జిల్లాలోని తోట్లవల్లూరు, ఘంటసాల మండలాల నుంచి రాత్రి సమయంలో ఇసుకను వాహనాల్లో లోడ్ చేయడానికి అవకాశం లేదని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. పగలు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఇసుక రేవుల్లో వాహనాల్లోకి ఇసుకను లోడ్ చేయాల్సి ఉంది. పగలు సమయంలో ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఉంచిన ఇసుకను రాత్రి సమయంలో కూడా వాహనాల్లో లోడ్ చేసేందుకు అవకాశం ఉంది. ఎన్ని టన్నులు ఇసుక వాహనాల్లో లోడ్ చేశారో కాటావేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు నగదును కట్టించుకుని, వాహనం నంబరు, ఏ ప్రాంతానికి ఇసుకను రవాణా చేస్తున్నారో కంప్యూటర్‌లో నమోదు చేసిన తర్వాత రసీదులను ఇవ్వాలి. కానీ కొంతకాలంగా ఈ ప్రక్రియకు తిలోదకాలు ఇచ్చారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వాహనాలను రేవులోకి తీసుకుపోయి వాటిలో ఇసుకను లోడ్ చేయించి ఒక్కో టిప్పర్‌కు కనీసంగా రూ.పదివేల నగదును అక్కడ నిర్వాహకులు తీసుకుని బయటికి పంపేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ తంతు కొనసాగుతోంది. ఈనెల 6వ తేదీన గుడివాడ డీఎస్పీ రాత్రిపూట గస్తీ తిరుగుతున్న సమయంలో ఇసుకను తరలిస్తున్న ఏడు టిప్పర్‌లను నిలిపి తనిఖీ చేశారు. ఈ టిప్పర్‌ల వద్ద ఇసుకను కొనుగోలు చేసినట్లు ఎలాంటి రసీదులు లేవు. దీంతో ఎలాంటి రసీదులు, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకి షాక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఒకరి పదవీ విరమణ బెనిఫిట్స్ మరొకరికి జమ చేసిన ఉదంతంపై అకౌంట్స్ జనరల్ సీరియస్ అయింది. మరొకరికి బదిలీ చేసిన డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో నాల్గోతరగతి ఉద్యోగి ఎం.వీరాస్వామి పదవీ విరమణ చేశారు. ఆయనకు చెల్లించాల్సిన డబ్బులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జ్యోతిరాణి అనే పదవీ విరమణ చేసిన ఏఎన్ఎంకు చెల్లించారు. ఈ విషయాన్ని గుర్తించిన అకౌంట్స్ జనరల్ వీరాస్వామికి లేఖ రాయడంతో విషయం వెలుగు చూసింది. తనకు డబ్బులు జమ కాలేదని అకౌంట్స్ జనరల్‌కు వీరాస్వామి చెప్పటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరాస్వామి పదవీ విరమణ బెనిఫిట్స్ చెల్లింపునకు దరఖాస్తు పెట్టిన నాటి విజయవాడ డివిజన్ ఈఈ ధవళేశ్వరపు రామలింగప్రసాద్‌కు ఈ నోటీసును ఇచ్చింది. వీరాస్వామికి చెల్లించాల్సిన రూ.8,91,420ను ఇప్పటి వరకు వడ్డీతో తిరిగి వసూలు చేసి చెల్లించాల్సిందిగా నిర్దేశించింది. ఈ వ్యవహారంలో పలువురు ఈఈలు ఇరుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది. ధవళేశ్వరపు రామలింగ ప్రసాద్ అప్పట్లో లేఖ రాయగా.. ఆయన తర్వాత వచ్చిన ఈఈ రంగ ప్రసాద్ థంబ్ వేశారు.

క్వారీ భూముల్లో డ్రాగన్స్

(5వ పేజీ తరువాయి)

ఆధారాలు చూపిద్దామంటూ ఎదురుచూస్తున్నారు.

■ కోడూరుపాడులోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి 1968లో వెలమ దొరలు సర్వే నంబర్ 111-1లో ఎకరం భూమి దానంగా ఇచ్చారు. ఆ భూమిని కూడా వదలకుండా రెవెన్యూ అధికారుల సహకారంతో(రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చి) వంశీ అనుంగ సహచరుల ద్వారా వేరే వ్యక్తి మైనారిటీ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. స్థానిక వైసీపీ నాయకుడు ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

■ ఇక పోలవరం కాలువపై రెండు వైపులా ఉన్న గట్లపై కొండల్లా ఉన్న మట్టిని సైతం తమ అధికారాన్ని ఉపయోగించి తవ్వి తరలించేయడంతో పాటు కొన్ని చోట్ల అనధికారిక లేఅవుట్లకు మెరక తోలారు. జగనన్న కాలనీల మెరక పేరుతో పోలవరం గట్టును కొల్లగొట్టారు.

■ బాపులపాడు మండలంలోని వందల ఎకరాల్లో వంశీ అనుచరులు చేసిన అవినీతి, అక్రమ తవ్వకాలపై అటు టీడీపీ నాయకులు, ఇటు స్థానికులు పోరాటం చేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ క్వారీయింగ్‌పై విజిలెన్స్ విచారణ అంటూ ఆరు నెలల కిందట హడావుడి చేసి నోటీసులిచ్చారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కానీ బడాబాబులు మాత్రం కార్లలో కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఎన్నికల వేళ ప్రత్యర్థులపై భౌతిక దాడులు

సార్వత్రిక ఎన్నికల వేళ వంశీ అనుచరులు రెచ్చిపోయారు. టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తరఫున ప్రచారం చేస్తున్న నేతలపై భౌతిక దాడులకు దిగి భయభ్రాంతులకు గురి చేశారు. ఈ దాడుల్లో గాయపడ్డ ఎందరో ఆస్పత్రుల పాలయ్యారు.

■ కొయ్యూరులో టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెంటపల్లి బాబూరావు అనే వ్యక్తిని దారుణంగా కొట్టారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. యార్లగడ్డ దగ్గరుండి మెరుగైన వైద్యం అందించడంతో బాబూరావు తిరిగి కోలుకున్నారు.

■ కుమార్తె బారసాల ఏర్పాట్లు చేసుకుంటున్న బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను మరో రెండు రోజుల్లో ఎన్నికలు అనగా దాడి చేసి కొట్టారు. ఆయన వాహనాన్ని ధ్వంసం చేశారు. దీనిపై ఆయన ఫిర్యాదు చేసినా ఇప్పటికీ నిందితులను అదుపులోకి తీసుకోలేదు.

■ టీడీపీ ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఆళ్ల గోపాలకృష్ణపై కొత్తమల్లవల్లిలో వైసీపీ శ్రేణులు మూకదాడి చేశాయి. దుస్తులు చించేసి వాహనాన్ని ధ్వంసం చేశాయి. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకూ కేసులో పురోగతి లేదు.

టమాటాలు నేరుగా రైతుబజార్లలో అమ్ముకోండి

- రైతులతో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు

జి.కొండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముదురు తోటల్లోని టమాటాలను రైతులు నేరుగా సమీపంలోని రైతుబజార్లలో అమ్ముకోవచ్చని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు సూచించారు. ఏ ఒక్క రైతు నష్టపోకూడదని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారని వారు తెలిపారు. టమాటా కేజీ 4 రూపాయలు అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గడ్డమణుగు గ్రామంలోని టమాటా తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పండించే నాటి నుంచి మార్కెంటింగ్ చేసుకునే వరకు టమాటా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హెచ్‌వో నీలిమ, మైలవరం ఎస్టేట్ అధికారి పి.చిట్టిబాబు, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



లేత టమాటా తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన, మార్కెటింగ్‌శాఖల అధికారులు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 465	

వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై శిక్షణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా చెత్తసేకరణ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా ప్రజ లకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో సంపత్‌కుమారి క్లాప్ మిత్రలకు సూచించారు. మన వ్యర్థ పదార్థాల నుంచి సంపద సృష్టించడంపై ఉయ్యూరు, పమిడి ముక్కల, పెదపారుపూడి మండలాల క్లాప్‌మిత్రలకు ఒక రోజు శిక్షణ పెద ఓగిరాలలో శనివారం నిర్వహిచారు. ఉయ్యూరు మండల ప్రత్యేక అధికారి జె జ్యోతి, ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

సాంకేతికతతో అపరిమిత జ్ఞానం

ఇంటెల్ డేటా సెంటర్ సీనియర్ ఇంజనీరింగ్ మేనేజర్ కేవీ రమేశ్

పెనమలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతతో అపరిమిత జ్ఞానాన్ని పొందవచ్చని, మానవుడు నేర్చుకొనే, ఆలోచించే విధానాల్లో పెను మార్పులు తీసుకొచ్చిందని ఇంటెల్ డేటా సెంటర్ సీనియర్ ఇంజనీరింగ్ మేనేజర్ కేవీ రమేష్‌బాబు పేర్కొన్నారు. పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన సితార్-2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఒక్క క్లిక్‌తో మనమందరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యక్తులతో కనెక్టు అవగలమన్నారు. సేఫ్ సంస్థ సహకారంతో నిర్వహించిన టెక్ ఎక్స్‌పోలో 1500మందికిపైగా పాఠశాలల విద్యార్థులు పోటీపడ్డారు. టెక్నికల్ క్విజ్, ప్రజెంటేషన్లు, సీఏడీడీ పోటీలు, బిజినెస్ క్విజ్ వంటి ఈవెంట్‌ల్లో వెయ్యి మంది కళాశాల విద్యార్థులు పోటీ పడ్డారు. విజేతలకు నాలుగు లక్షల విలువైన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షులు ఎంరాజయ్య, కన్వీనర్ నాగభూషణరావు, ప్రిన్సిపాల్ శివాజీ బాబు, టెక్నోఫెస్టు కన్వీనర్లు రఘుకుమార్, వీ జగదీష్, గౌరవ అతిథి ఎస్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.


సితార్-2025 కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఇంజనీరింగ్ మేనేజర్ రమేశ్

ఘనంగా ముగిసిన సుప్రజ్ఞ-2025 వేడుక

కానూరు సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో రెండురోజుల సుప్రజ్ఞ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు శనివారం వివిధ రకాల సాహిత్య పోటీలు అలరించాయి. నృత్యం, గానం, సృజనాత్మక రచన, సమూహ చర్చలు, వాదవివాదం, కవిత్వం తదితర విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షులు ఎం రాజయ్య మాట్లాడుతూ, దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ఉత్సవం ద్వారా అభివృద్ధి చేసుకొన్న నైపుణ్యాలను తమ భవిష్యత్తులో ఉపయోగించుకోవాలని కోరారు. ప్రోవీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల పట్టుదలను, కృషిని అభినందించారు. వివిధ విభాగాల్లో విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రవిచంద్, డైరెక్టర్ డాక్టర్ పాండురంగారావు, డీన్ వెంకటరావు, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఎం పద్మజ పాల్గొన్నారు.


వీఆర్ సిద్ధార్థలో జరిగిన సుప్రజ్ఞ - 2025 వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. పెనమలూరు మండలంలో 10,594 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి గాను పోరంకి జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎనిమిది పోలింగ్ బూత్‌లను, పెనమలూరు ఉన్నత పాఠశాల్లో మూడు బూత్‌లతో కలిపి మొత్తం 11 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని రూరల్ ఓటర్లు పెనమలూరు ఉన్నత పాఠశాలలో, పట్టణప్రాంత ఓటర్లు పోరంకి ఉన్నత పాఠశాలలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

బాపులపాడులో..

హనుమాన్‌జంక్షన్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు సిద్ధం చేశారు. మండల కేంద్రమైన బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మూడు బూత్‌లను (నెం : 126, 127,128) కేటాయించారు. ఓటర్లు గుర్తించే విధంగా మూడు బూత్‌లకు నెంబర్లు ఇచ్చి సిద్ధం చేస్తున్నారు. శనివారం ఆ పనులను ఆర్ఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మండలంలో 2,628 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు.

లక్ష్మణరావును గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బండారుగూడెంలో ప్రచారం నిర్వహించారు. సమస్యలపై పట్టభద్రుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు లక్ష్మణరావుకు మద్దతుగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, రామకృష్ణ, బర్రె లెనిన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పోరంకిలో జరిగిన యూనియన్ బ్యాంకు అధికారుల సమావేశంలో డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేస్తున్న అధికారులు

మహిళా సాధికారతే లక్ష్యం

● యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కాటం వెంకట్రావు

పెనమలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు పనిచేస్తుందని బ్యాంకు రీజనల్ హెడ్ కాటం వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం యూనియన్ బ్యాంకు పోరంకి, పెనమలూరు బ్రాంచిల సదస్సును పోరంకి ఎంఎంఎస్ బ్రాంచిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో రుణాలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు రుణాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌హెచ్ తాతాజీ, ఆర్‌ఏబీడీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, బ్రాంచిల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

కాటూరులో పోలీసుల పల్లెనిద్ర

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాటూరులో శుక్రవారం రాత్రి పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. కంకిపాడు సీఐ జె మురళీకృష్ణ గ్రామస్థులతో మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, జూదం, గంజాయి, మత్తుపదార్థాల సమాచారం అందించి పోలీసులకు గ్రామస్థులు సహకరించాలన్నారు. అనంతరం రూరల్ ఎస్సై కె సురేశ్ బాబుతో కలసి గ్రామంలో నిద్రించారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఉంగుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి బైక్‌ను దొంగిలించుకుపోయిన కేసులో నిందితుడిని శనివారం ఆత్కూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు తండాకి చెందిన బాణావత్ మురళీనాయక్ (29) వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటుపడ్డాడు. పలు నేరాల్లో జైలుకెళ్లి వచ్చాడు. కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన గుణదల ప్రమోద్ (20) ఆగిరిపల్లిలోని తన పెద్దమ్మ ఇంటికి బైక్‌పై వెళ్తుండగా పెదఅవుటపల్లిలో లిఫ్ట్ కావాలని బండి ఆపి ఎక్కాడు. పోలవరం కాలువకట్టవద్దకు వెళ్లగానే తను బహిర్భూమికి వెళ్లాలని చెప్పి బండి పక్కకు ఆపించాడు. వెంటనే తను తెచ్చుకున్న కత్తితో ప్రమోద్‌ను బెదిరించి బైక్‌తో పరారయ్యాడు. జరిగిన ఘటనపై ప్రమోద్ అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన హెడ్‌కానిస్టేబుల్ కిషోర్ దర్యాప్తు చేపట్టి, సాంకేతిక సహకారంతో నిందితుడి ఆచూకీ తెలుసుకున్నారు. శనివారం మధ్యాహ్నం పొట్టిపాడు టోల్‌గేటువద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు తరలించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజయవాడ రోడ్డులో కృష్ణవేణమ్మ వీధిలో గుర్తుతెలియని దుండగుడు చొరబడి ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలి మెడలోని రూ.4లక్షలు విలువ చేసే బంగారు గొలుసును అపహరించాడు. శుక్రవారం రాత్రి కృష్ణమ్మ వీధిలో నివాసం ఉం టున్న యనమదల అరుణకుమారి వీధి తలుపు మెస్ డోర్ వేసి వంటింట్లో పని చేసుకుంటోంది. గుర్తుతెలియని వ్యక్తి చొరబడి వృద్ధురాలి ముఖంపై దుప్పటి కప్పి మెడలో ఉన్న 8కాసుల బంగారు గొలుసును అపహరించాడు. బాధితురాలు శనివారం జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.


అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించేందుకు దుకాణం వద్ద కొనుగోలు చేస్తున్న భక్తులు

తిరునాళ్లలో ప్రసాదాల పంపిణీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు వివిధ సంస్థలు, పలువురు వ్యక్తుల ఆధ్వర్యంలో శనివారం ప్రసాదం పంపిణీ చేశారు. శివకృష్ణ గ్యాస్ ఏజెన్సీ అధినేత అంగడా శివప్రసాదరావు తన తల్లిదండ్రులు అంగడాల పిచ్చయ్య, కుసుమాంబ జ్ఞాపకార్థం వేలాది మంది భక్తులకు చక్కెర పొంగలి ప్రసాదం పంపిణీ చేశారు. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కొలుసు శ్రీనివాసరావు, రాంబాబు, శివప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొని సేవలందించారు. తిరునాళ్ల చివరి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు తరవచ్చి అమ్మవారికి పసుపు కుంకుమ, చీర సారె సమర్పించారు. నవ దంపతులు పసుపుబట్టలతో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణంలో దుకాణాలు కిక్కిరిశాయి.

రంగన్నగూడెంలో బోర్ల వద్ద చోరీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రంగన్నగూడెంలోని వ్యవసాయ బోరు మోటార్ల వద్ద కేబుల్ వైర్లను కత్తిరిం చడంతో పాటు తాళాలను కోసి పంపు షెడ్లలోని వ్యవసాయ పనిముట్లుకు కూడా చోరీ చేసిన ఘటన శుక్ర వారం జరిగింది. గ్రామానికి చెందిన 30 బోర్ల వద్ద వ్యవసాయ మోటార్లకు చెందిన వైర్లను కత్తిరించడంతో పాటు ఆళ్ల గోపాలకృష్ణకు చెందిన షెడ్డు తాళాన్ని కోసివేసి అందులోని వ్యవ సాయ పనిముట్లను, కలుపుమందులు చోరీ చేయడంతో పాటు షెడ్డులోని వస్తువులను చిందరవందర చేసి బీభత్సం సృష్టించారు. తన బోరు షెడ్డు తాళాన్ని కోసి సుమారు రూ.2లక్షల విలువైన ఆయిల్‌పామ్ గెలలు కోసే అలుగులు 4, సబ్ మెర్సిబుల్ మోటార్ కేబుల్ 300 మీటర్లు, కలుపుమందు డబ్బాలు 5లీటర్లవి 6 చోరీ చేసినట్లు ఆళ్ల వివరించారు


చోరీ జరిగిన గది

ప్రత్యేక దళాలతో గస్తీ

నిన్న జరిగిన వ్యవసాయ పంపుసెట్ల వద్ద వరుస చోరీలపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకురాగా ఆయన శనివారం ఉన్నతాధికా రులతో ఫోన్‌లో మాట్లాడారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, గుడివాడ సీపీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ జి.బి. శ్రీనివాసరావు సోమవారం నుంచి ప్రత్యేక గస్తీ బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారని ఆళ్ల వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, తదితరులతో పాటు బాధిత రైతులు పాల్గొన్నారు.


సిమెంట్ ఫ్యాక్టరీ నమూనాతో రూపకర్త స్టాలిన్ బాబు, ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు

యువ ఇంజనీర్లు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

ప్రసాదంపాడు: యువ ఇంజనీర్లు ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా రాణించి పరిశ్రలు స్థాపించాలంటే నైపుణ్యాలపై పట్టు సాధించాల్సిన ఆవశ్యకత ఉందని విశ్రాంత మెకానికల్ ఇంజనీర్, సిమెంట్ ఫ్యాక్టరీ నమూనా రూపకర్త స్టాలిన్‌బాబు అన్నారు. శనివారం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సిమెంట్ ఫ్యాక్టరీ యంత్రాల నమూనాల అంశంపై వర్కుషాపు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ, సిమెంట్ ఫ్యాక్టరీ రంగంలో స్టాలిన్‌బాబుకు అనేక సంవత్సరాలుగా అనుభవం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, డీన్ రమేష్, మెకానికల్ విభాగాధిపతి కిషోర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : యువత భవిష్యత్తు కోసం కృషిచేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేయడం ద్వారా పట్టభద్రులకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు తెలిపారు. బిళ్లనపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాల్లోని పట్టభద్రులను శనివారం కలిసి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వీరమాచినేని సత్యప్రసాద్, సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, వడ్డి శివనాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు. కాకులపాడు, రంగయ్యప్పారావుపేట గ్రామాల్లో యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నమూనా బ్యాలెట్ పత్రాలను చూపిస్తూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్షణ జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఫణి ధూర్జటి

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అట్టడుగున వెనుకబడి ఉన్న పిల్లల సంక్షేమం, అభివృద్ధి సాధనకు వారిలో అక్షరజ్యోతి వెలిగించి మెరుగైన అభ్యసన ఫలితాలు వచ్చేలా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కృషినప్పుడే సమాజంలో అభివృద్ధి కన్పిస్తుందని జిల్లా ట్రైబల్ ఆఫీసర్, సమగ్ర శిక్షణ జిల్లా అదనపు కో-ఆర్డినేటర్ ఫణి ధూర్జటి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 4వ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఈవో సుధారాణి మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాలలో అమలు చేసి పిల్లల అభివృద్ధి, శారీరక, మానసిక వికాసానికి బాటలు వేయాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్యాంసుదరరావు, ఏఎస్‌ఓ సుభాన్, రాంబాబు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ పీవీ రమణ, అబ్దుల్ హబీబ్, హరిబాబు, బేబి సరోజిన పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : అంగన్వాడీ చిన్నారుల్లో సామాజిక భావోద్వేగ అభివృద్ధితో పాటు సృజనాత్మకతను పెంపొందించేలా కృషి చేయాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ అన్నారు. స్థానిక బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రాం బాలసింగ్ పర్యవేక్షణలో రీసోర్సు పర్సన్స్ రాజారత్నం, దేవి, శివశంకర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు శాంతి శిరీష, ధనలక్ష్మి, డీఆర్పీలు పాల్గొన్నారు.

శివరాత్రి పుణ్యస్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

కంకిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :శివరాత్రి పుణ్యస్నానాలు ఆచరిం చేం దు కు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ భవన్నారాయణ ఆదేశించారు. మండలంలోని మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్‌ఘాట్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవన్నారాయణ మాట్లాడుతూ, ఈ నెల 26న శివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 20 వేల నుంచి 25 వేల మంది పుణ్యస్నానాలు ఆచరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చింతా కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ భవన్నారాయణ







ప్రకృతి చిత్రం.. జీవన సౌందర్యం

నిజమైన అందం ఎక్కడుంది.. ఆధునిక నగరాల్లోనా.. లేక ప్రకృతి ఒడిలోనా అంటే ఖచ్చితంగా ప్రకృతిలోనే అని చెబుతాం. కాంక్రీట్ జంగిల్‌గా మారిన ఈ నగరాన్ని ప్రకృతి దగ్గరగా, పల్లె సౌందర్యాన్ని కళ్లకు కనిపించేలా చేసే వర్ణ చిత్రరాజాలు నగర గోడలపై దర్శనమిస్తున్నాయి. బెజవాడలో ఎంజీ రోడ్డు ఓ ఐకానిక్. నగరానికి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్న ఈ రోడ్డును 'సిటీ ఆన్ ఆర్ట్స్'లో భాగంగా కార్పొరేషన్ అధికారులు కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్డుకిరువైపులా గోడలపై చక్కటి పెయింటింగ్స్‌ను వేయిస్తున్నారు. ఇప్పటికే రాఘవయ్య పార్క్, నిర్మల్ హృదయ్ భవన్, బాపు మ్యూజియం, సబ్ కలెక్టరేట్ కార్యాలయం వైపు అత్యద్భుత వర్ణ చిత్రాలను ఆవిష్కరించారు. తాజాగా ఆలిండియా రేడియో (ఆకాశవాణి) గోడలపై మరింత అద్భుతమైన వర్ణ చిత్రాలను సాక్షాత్కరింపజేస్తున్నారు. ఈ చిత్రాలు అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఉల్లాసాన్ని పంచుతున్నాయి. గజిబిజి జీవితంలో ఉరుకులు, పరుగులు పెట్టేవారంతా ప్రయాణ సమయాల్లో ఈ పెయింటింగ్స్‌ను చూసి మనసును తేలిక పరచుకుంటున్నారు. విద్యార్థులైతే వాటి అందాలను ఆస్వాదిస్తూ ఊహాత్మక ప్రపంచంలో తేలియాడుతున్నారు. ఇలా... వాహ్ అనిపించేలా నయనమనోహరమైన వర్ణచిత్రాలతో ఎంజీ రోడ్డు సరికొత్తగా కళాత్మకంగా కనిపిస్తోంది. నగరమంతా ఇలా ఉంటే ఎంతో బాగుణ్ను అనిపిస్తోంది కదా.. నగరంలోని కనకదుర్గ, బెంజిసర్కిల్, పోలీసు కంట్రోల్ రూమ్, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్లతో పాటు కనకదుర్గ వారధి వద్ద కూడా ఈ పెయింటింగ్స్ వేయించాలని కళాపిపాసులు కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి.








దుర్గగుడిలో నేడు సరస్వతీయాగం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఆదివారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ యాగాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో కె.రామచంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల మూలానక్షత్రం నాడు సరస్వతీ యాగాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 23న ఆదివారం కూడా మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీ యాగాన్ని నిర్వహిస్తున్నారు. మాఘమాసం కూడా రావటంతో సూర్యోపాసన సేవ జరుగుతుంది. ఈనెల 24, 26న కూడా సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. శనివారం ఆలయంలో జరిగిన వివిధ ఆర్జిత సేవల్లో 380 మంది పాల్గొన్నారు. ఖడ్గమాలార్చనలో 24 మంది, చండీ హోమంలో 49 మంది, లక్ష కుంకుమార్చనలో 10 మంది, శ్రీచక్ర నవావరణార్చనలో ఏడుగురు, వేద ఆశీర్వచనంలో 46 మంది, మల్లేశ్వరస్వామి అభిషేకంలో 15 మంది, పంచహారతుల్లో 25 మంది పాల్గొన్నారు.

నగరంలో 'పతంగ్' చిత్ర బృందం సందడి

లబ్బీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో పతంగ్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మొగల్రాజపురం సిద్ధార్థ కాలేజీ, కానూర సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన వేడుకల్లో చిత్రంలోని 3వ పాటను విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో ప్రణవ్ కౌశిక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు భారతీయ సినిమాల్లో ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారని, తొలిసారిగా పతంగుల పోటీతో రాబోతున్న స్పోర్ట్స్ కామెడీ డ్రామాగా తీసిన ఈ పతంగ్ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషాన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మాక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ పత్తిపాటి దర్శకుడిగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ సినిమా థియేటర్స్‌లో యూత్ ఫెస్టివల్‌గా, కొత్తగా, మంచి క్వాలిటీ ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేస్తున్నామన్నారు. మరో హీరో వంశీ పూజిత్, సంగీత దర్శకుడు జోస్ జిమ్మి, డ్యాన్స్ మాస్టర్ టిప్పు, చిత్ర నిర్మాతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు టౌన్ ఈఈ పీ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కబేళా ఇండస్ట్రియల్ 2 నుంచి 5 క్రాస్ రోడ్ల వరకు బ్రహ్మయ్య కాలనీ, కెనరాబ్యాంక్ వెనక భాగం తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నియంత్రణలోనే బర్డ్ ఫ్లూ

- అయినా అప్రమత్తంగా ఉన్నాం
- బయో సెక్యూరిటీ చర్యలను కొనసాగించాలి
- ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్ ఫ్లూ నియంత్రణలోనే ఉందని, అయినా అప్రమత్తంగానే ఉన్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. వైరస్ నివారణ, నియంత్రణ చర్యలపై సమీక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని, రెవెన్యూ, పంచాయతీరాజ్, పశుసంవర్థక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. ఎవరికైనా అపోహలుంటే అధికారులు, సిబ్బంది తొలగించాలని సూచించారు. ఏ కొండూరు మండలం, దీప్లానగర్ పరిసర ప్రాంతాల్లో నియంత్రణ, కట్టడి చర్యలను కొనసాగించాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి విషయంలోనూ నిర్దిష్ట స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని అనుసరించాలన్నారు. వలస, అటవీ పక్షుల్లో అసహజ మరణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్య కుమారి, డీడీ (ఏహెచ్) డాక్టర్ మోజెస్ వెస్లీ, ఏడీ డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

అందుబాటులో జీబీఎస్‌కు ఇంజక్షన్

- సూపరింటెండెంట్ ఏవీ రావు



ఆంధ్రజ్యోతి, ప్రభుత్వాసుపత్రి: జీబీఎస్ వ్యాధికి ప్రభుత్వాసుత్రిలో ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రికి సంబంధించిన వైద్య సేవలు, పలు విషయాలపై స్పందించారు.

ప్రశ్న: కొత్త ప్రభుత్వాసుపత్రిలో నూతన భవనాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారు. ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

ఏవీ రావు: నూతన భవనాన్ని 2025 ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తెస్తాం. బిల్లుల చెల్లింపులు డీఎమ్ఈ పరిధిలో ఉంటుంది.

ప్రశ్న: జీబీఎస్ కేసులకు సంబంధించి ప్రభుత్వాసుపత్రిలో ఎలాంటి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు

ఏవీ రావు: శరీర రోగనిరోధక ప్రతిచర్య వల్ల జీబీఎస్ వ్యాధి వస్తుంది. ఈవ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు జనరల్ మెడిసిన్, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

ప్రశ్న: రోగుల రద్దీని తగ్గించేందుకు ఓపీ సేవలు అందరికీ అందేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఏవీ రావు: ఎక్కడైతే ఓపీ తక్కువగా ఉంటుందో అక్కడున్న సిబ్బందిని ఓపీ ఎక్కువగా ఉన్న చోటికి పంపి వైద్య సేవలందిస్తున్నాం.

ప్రశ్న: మందుల కొరత ఉందా, ఏఏ మందులు లేవు, ఎన్ని మందులు కొంటున్నారు, బడ్జెట్ ఎంత? నిధులు వస్తున్నాయా లేదా?

ఏవీ రావు: మందులు కొరత ఏం లేదు. అవసరమైతే బయట నుంచి మందులు కొనుగోలు చేస్తున్నాం. అన్ని మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

ప్రశ్న: ప్రభుత్వాసుపత్రిలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని ఆరోపణలున్నాయి. పని చేస్తున్నాయా లేదా?

ఏవీ రావు: ఆసుపత్రిలో అన్ని సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. పని చేయని వాటిని గుర్తించి వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నాం.

ప్రశ్న: సెక్యూరిటీ సిబ్బంది ఎంత మంది ఉన్నారు. అందరూ పని చేస్తున్నారా, కొందరు విధులకు రావడం లేదని ఆరోపణలున్నాయి.

ఏవీ రావు: ప్రభుత్వాసుపత్రిలో 169 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. వారు 3 షిఫ్టుల్లో పని చేస్తున్నారు.

ఎన్టీటీపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కొండపల్లి ప్రజా పరిరక్షణ సమితి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బూడిదతో తాగునీరు కలుషితమయ్యేందుకు కారణం అవ్వడమే కాక మైలవరం నియోజకవర్గంలో పలు గ్రామాలకు తాగునీటి ఎద్దడికి కారణమైన ఎన్టీటీపీఎస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొండపల్లి ప్రజా పరిరక్షణ సమితి నాయకులు, వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు బూడిద నీరు కలుస్తున్న ఫిల్టర్ బెడ్‌ను, కెనాల్‌ను, పంపుహౌస్‌ను పరిశీలించారు. వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న ఎన్టీటీపీఎస్ అధికారులు ఇప్పుడు తాగునీరు కలుషితం అయ్యేందుకు కారణం అవుతున్నారని దుయ్యబట్టారు. నిర్లక్ష్యంగా ఉంటున్న ఎన్టీటీపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ సమితి సభ్యులు, వైసీపీ సభ్యులు పాల్గొన్నారు.



టీడీ జనార్థన్‌ను సత్కరిస్తున్న ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ సంస్థ ప్రతినిదులు

గత ప్రభుత్వంలో పెన్షనర్లకు ఇబ్బందులు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్థన్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆ బాధల నుంచి విముక్తి పొందేందుకు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్థన్ అన్నారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో శనివారం ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్థన్ మాట్లాడుతూ నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు పనిచేశారని, ముఖ్యంగా ఉద్యోగులు, పెన్షనర్ల పాత్ర ఎక్కువన్నారు. పెన్షనర్ల అపరిష్కృత సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులకు ముఖ్యమంత్రితో కలిసే అవకాశం కల్పించడం ద్వారా వారి సమస్యలు నేరుగా వివరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న సమస్యలు, పడిన కష్టాలను ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు వివరించారు. పార్టీ అధ్యక్షుడు పాలంకి సుబ్బరామన్, జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ మునయ్య, పార్టీ ప్రతినిధులు సుధాకర్, జయ రామప్ప, సతీష్, నాగభూషణం, శాస్త్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్థన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మంగళగిరి క్రైం పోలీసుల అదుపులో వన్‌టౌన్ బంగారం వ్యాపారి

సుమారు రూ.20 లక్షల విలువైన 300 గ్రాముల స్వాధీనం?

వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ శివాలయం వీధిలో బంగారం వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారిని మంగళగిరి క్రైం పోలీసులు శనివారం తెల్లవారుజామున అతడి ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. చిట్టినగర్‌లో నివాసముంటున్న అవ్వారు గంగాధర్ వన్‌టౌన్ శివాలయం వీధి, బాబు ఆయిల్ దుకాణం సమీపంలోని బిల్డింగ్ మొదటి అంతస్తులో విఘ్నేశ్వర జ్యూయలరీ పేరుతో బంగారం వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల మంగళగిరికి చెందిన పలువురు నేరస్థుల వద్ద దొంగ బంగారం కొనుగోలు చేసినట్టు సమాచారం. మంగళగిరి క్రైం పోలీసులు 3 రోజుల క్రితం పలు చోరీ కేసుల్లో నేరస్థులను అదుపులోకి తీసుకుని విచారించగా గంగాధర్‌కు అమ్మినట్టు తెలిపారు. 4రోజుల క్రితం గంగాధర్ బంగారం షాపు దగ్ధమైంది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పోలీసులకు కూడా ఫిర్యాదు చేయకపోవటంపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున మంగళగిరి క్రైం పోలీసులు చిట్టినగర్‌లోని ఇంటికి వెళ్లి గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని సుమారు రూ.20లక్షల విలువైన 300 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని మంగళగిరి క్రైం పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నట్టు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

- కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో వ్యవసాయ, ఉద్యానశాఖ, సెర్ప్ అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెకర్ మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్ ప్రణాళికలో ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు మొగ్గుచూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెరిగేలా చూడాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులను మాత్రమే కాకుండా, నవధాన్యాలను పొలంలో చల్లి, భూమిని సారవంతంగా తయారుచేసేందుకు, రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర డీపీఎం పార్థసారథి, వ్యవసాయ, ఉద్యానశాఖ జేడీలు పద్మావతి, ఏ జ్యోతి, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్, వ్యవసాయశాఖ ఏడీలు, ఏవోలు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మాభిమానం జోలికి వస్తే ఖబడ్దార్

- మాజీ మంత్రి పేర్నికి గురుమూర్తి హెచ్చరిక

వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆత్మాభిమానం జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానీని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శనివారం హెచ్చరించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ అంటేనే బీసీలని, బీసీలంటేనే టీడీపీ అని అన్నారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా సముచిత స్థానం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని శుక్రవారం బీసీ నేత, మంత్రి కొల్లు రవీంద్రపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీసీలను చులకన చేసి మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. రాష్ట్ర కేబినెట్‌లో దాదాపు 8 మంది బీసీలు మంత్రులుగా ఉన్నారన్నారు. మచిలీపట్నంలో జగన్ పాలనలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదని విమర్శించారు. రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని పేర్ని నాని మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.

వార్డెన్, ఏబీసీడబ్ల్యువో సస్పెన్షన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మైలవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ కట్టా రమాదేవి, ఏబీసీడబ్ల్యువో రవి ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 'వామ్మో వసతి గృహం' అనే శీర్షికన ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో విద్యార్థుల ఇబ్బందులు, వార్డెన్ నిర్వాకాన్ని కళ్లకు కట్టినట్టు వివరించడంతో మరుసటి రోజు డీ బీసీడబ్ల్యువో మల్లేశ్వరరావు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుని వార్డెన్ నిర్వాకంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రెండేళ్ల నుంచి వసతి గృహానికి రానందుకు వార్డెన్‌పై, ఏబీసీడబ్ల్యుగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన 3 మాసాల్లో వార్డెన్ నిర్వాకంపై చర్యలు తీసుకోనందుకు అతడిపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా శనివారం వార్డెన్‌తో పాటు ఏబీసీడబ్ల్యువోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఉత్తర్వులు ఇచ్చినట్టు డీబీసీడబ్ల్యువో తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పామర్రు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లకుంటలో ఉన్న ఏపీ ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు మార్చి 6లోపు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన దరఖాస్తులను అనుసరించి ఏప్రిల్ 6న ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.465

పైడమ్మ దేవస్థానం ఈవోగా కృష్ణారావు

పెడన, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతిగాంచిన పైడమ్మ దేవస్థానం ఈవోగా జి.వి. కృష్ణారావు నియమితులయ్యారు. విజయవాడలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం గ్రేడ్-2 ఈవోగా పనిచేస్తున్న కృష్ణారావును బదిలీపై పైడమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు. కృష్ణారావు పైడమ్మతల్లి దేవస్థానంతో పాటు పెడనలోని అగస్త్యేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి, శ్యామలాంబ ఆలయాలకు ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దొంతు మహేశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

దుర్గానాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు నేటి నుంచి



మోపిదేవి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువై ఉన్న దుర్గానాగేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చన, అనువంశిక ధర్మకర్తలు చల్లపల్లి రాజా వంశీయులచే జగాజ్యోతి కార్యక్రమం, దివ్య కల్యాణ మహోత్సవం, నందివాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి. 27వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివార్ల రథోత్సవం, 28వ తేదీ ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం, శమీవృక్ష పూజ జరుగుతాయి. మార్చి 1, 2, 3 తేదీల్లో స్వామివారి పవళింపు సేవాతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయి. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని చాందిని టెంట్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం నేడు

● 92 సంవత్సరాల బ్యాచ్‌లకు ఆహ్వానం



చల్లపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరుగనుంది. శ్రీమంతు రాజా హైస్కూల్, శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ జూనియర్ కళాశాలలో ఇప్పటి వరకూ విద్యాభ్యాసం చేసిన 92 సంవత్సరాల పూర్వవిద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఎన్నారై మండవ శేషగిరిరావు నేతృత్వంలో ఆర్గనైజింగ్ కమిటీ దాదాపుగా పూర్తిచేసింది. హైస్కూల్, కళాశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగిన పలువురు ప్రముఖులు ఆత్మీయ సమావేశంలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటల వరకు సమావేశం జరుగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, వినూత్న కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నారై మండవ శేషగిరి, విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ ప్రభృతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పులిగడ్డ ఆక్విడెక్టుకు మరమ్మతులు ప్రారంభం

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దివిసీమలోని 72 వేల ఎకరాలకు సాగునీరు అందించే జీవనాడిగా ఉన్న పులిగడ్డ ఆక్విడెక్టుకు మరమ్మతు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్న మండలి బుద్దప్రసాద్ ఆక్విడెక్ట్ పరిరక్షణ కోసం నిరసన దీక్ష చేపట్టారు. ఆక్విడెక్ట్ పరిరక్షణకు రూ.40 లక్షలు వ్యయం చేస్తున్నట్లు గత పాలకులు తెలిపినా వాస్తవానికి అవి కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దివిసీమలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని 72 వేల ఎకరాలకు ఈ ఆక్విడెక్ట్ జీవనాడిగా ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆక్విడెక్ట్ మరమ్మతులు చేపట్టారు. ఆక్విడెక్ట్‌కు కొత్త రెయిలింగ్ ఏర్పాటు చేస్తారు. షట్టర్లు, తొట్టెల పగుళ్లకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరమ్మతులు జరుగుతున్నాయి.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

పెడన రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాజులపాటి వాణి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజులపాటి వాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేందుకు, ఉచిత పుస్తకాలు సిద్ధం చేశామని ఎంఈవో హరనాథ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ అందిస్తుందని, బ్యాంకుల నుంచి రుణాలు పొంది విద్యుత్ ఉత్పత్తి చేస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ట్రాన్స్‌కో ఏఈ కొండలరావు అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. గౌడపాలెం యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని సర్పంచి సత్యన్నారాయణ కోరారు. వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, అచ్యుతరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.





బడ్డీలను తొలగించి, ఎక్స్‌కవేటర్లతో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది, మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో వాగ్వాదానికి దిగిన రామ్‌నితీష్

రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల తొలగింపు

● కమిషనర్ బాపిరాజుతో ఆక్రమణదారుల వాగ్వాదం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని లక్ష్మీటాకీసు సెంటర్ నుంచి బైపాస్‌రోడ్డు మార్గంలో ఆక్రమణలను శనివారం నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. డ్రెయిన్లు ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేయడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడు మురుగునీరు రోడ్ల మీదా ప్రవహిస్తోంది. దోమల బెడద ఎక్కువయిందని ప్రజలు పలు పర్యాయాలు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, పోలీసు బలగాలతో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఆరు ఎక్సకవేటర్లతో బడ్డీలను తొలగించి యజమానుల ఇళ్ల వద్ద పెట్టారు. డ్రెయిన్లపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. డీమార్ట్ వద్ద ఆక్రమణలు తొలగించేందుకు వచ్చిన మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో పీవీఆర్ మాల్ యజమాని జల్లు రామ్‌నితీష్ వాగ్వాదానికి దిగారు. తాను నిర్మించిన ప్రైవేట్ ప్రాపర్టీలోకి మునిసిపల్ అధికారులు రావడం ఏమిటని జల్లు రామ్ నితీష్ ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి తీసుకున్న ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేశామన్నారు. దీంతో మునిసిపల్ అధికారులు డీ మార్ట్ ముందు డ్రెయిన్‌పై ఉన్న చిన్న చిన్న ఆక్రమణలు తొలగించి వెళ్లిపోయారు.

ఆలపాటికి మెజారిటీపై దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు సునాయాసమని, మెజారిటీపై నాయకులందరూ దృష్టి సారించాలని మచిలీపట్నం పార్లమెంటు ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త బండి రామకృష్ణ అన్నారు. మచిలీపట్నంలోని పలు ప్రాంతాల్లో బండి రామకృష్ణతో పాటు మాజీ మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, పుప్పాల ప్రసాద్, జనసేన నాయకులు గడ్డం రాజు, శాయన శివయ్య, లంకిశెట్టి నీరజ, తాడేపల్లి కిరణ్, జమీల్, శ్రీదేవి, సుంకర దేవి, గణేష్, చిరంజీవి ప్రచారంలో పాల్గొన్నారు. **పెడన** : ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు శనివారం పెడనలో ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటికి వేసి గెలిపించాలని కోరారు. అబ్దుల్ ఖయూం (హన్ను), యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, హమీదుల్లా, బెజవాడ నాగరాజు, పరసా సూర్యనారాయణ, అబ్దుల్ ఖదీర్, తమ్మా బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి : మండలి

చల్లపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ స్పష్టం చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు మోర్ల రాంబాబు స్వగృహంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం కూటమి నాయకుల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లను కలవటంతోపాటు దూ ర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ప్రతీ ఒక్కరూ పోలింగ్ రోజు తమ మండల కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా శ్రద్ధ వహించాలని సూచించారు. కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ కృష్ణకుమారి, స్వప్న, గొరిపర్తి సుబ్బారావు, తోట కనకదుర్గ, రావి చంద్రశేఖర్ (చిట్టి), మోర్ల ప్రసాద్, బోలెం నాగమణి, కొడాలి మురళీ, షేక్ నబీఘోరి, తాతా ప్రదీప్, మేడికొండ విజయ్, రవిబాబు, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, సూదాని నందగోపాల్ పాల్గొన్నారు. **ఘంటసాల** : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు పోలయ్యేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. కొడాలి టీడీపీ కూటమి నేతలతో శనివారం ఆయన ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను కూడా రప్పించేందుకు కృషి చేయాలన్నారు. కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్, తుమ్మల జనార్ధనరావు, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, వేమూరి వెంకయ్య, పరిశె చలపతి, మేడికొండ విజయ్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోన రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.55.25 లక్షల మంజూరు

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కంకటావ గ్రామంలోని ఉమా మహేశ్వర, వెంకటాచల, వేణుగోపాల స్వామి దేవస్థానం పునరుద్ధరణకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అభ్యర్థనకు మేరకు రూ. 55.25 లక్షలు దేవదాయ శాఖ మంజూరు చేసింది. నిధులను మంజూరు చేసిన దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, వాకా శ్రీనివాసరావు, సర్పంచ్ మోహనరావు, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కట్టా మునీశ్వరరావు, పోతుల రాము, బొర్రా శ్రీను, శాయన సోమయ్య, బాసంశెట్టి శ్రీను, గంగన్న కృతజ్ఞతలు తెలిపారు.

మోపిదేవి - వెంకటాపురం రహదారికి మరమ్మతులు

మోపిదేవి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి నుంచి వెంకటాపురం వరకు 4.4 కిలో మీటర్ల జిల్లా పరిషత్ రహదారికి మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ఈ నెల 26, 27 తేదీల్లో పెదకళ్లేపల్లిలో జరిగే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు విచ్చేయనున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ బి.శ్రీనివాస్ తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు ముదిరాజ్‌పాలెంకు చెందిన డి. నాగేశ్వరమ్మ మృతి చెందారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం శనివారం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేసింది. ముద్దినేని వెంకటేశ్వరరావు, బాబు, వెంకట్, నాంచారయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పోతురాజు స్వామి జాతర ప్రారంభం

నాగాయలంక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో పోతురాజు స్వామివారి వార్షిక జాతర మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఆదివారం రాత్రితో ముగుస్తుంది. జాతరలో మొదటి రోజున స్వామివారి ఘటాలను గణాచారులు కోలాహలంగా పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ భక్తబృందం ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

ఘంటసాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కృషి విజ్ఞాన కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తల బృందం, కార్యాలయ సిబ్బంది నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ వి.మంజువాణి, జె.యశ్వంత్ కుమార్, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నీరు, మట్టి నాణ్యతాప్రమాణాలపై శిక్షణ

ఘంటసాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో యువతకు చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు, మట్టి నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్.డి. సుధారాణి మాట్లాడుతూ చేపల, రొయ్యల చెరువుల మట్టిలో ఉండాల్సిన పోషకాలను గుర్తించాలన్నారు. చేపలు, రొయ్య ల చెరువుల్లో నాణ్యతా ప్రమాణాల లేమి, పోషకాహార లోపం వల్ల కలిగే దుష్పరిణామాలను, వ్యాధులను మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ వివరించారు. డాక్టర్ వెంకటలక్ష్మి భూసార పరీక్షలను వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలి

కోడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు విశిష్ట సంఖ్యకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ తెలిపారు. మండలంలో రైతులకు విశిష్ట సంఖ్యన మోదుపై మైక్ ప్రచారం నిర్వహించారు. **నాగాయలంక** : ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు రైతులందరికీ అందాలంటే ప్రతి రైతు విశిష్ట గుర్తింపుఎ సంఖ్యను పొందాలని మం డల వ్యవసాయ శాఖ అధికారి ఏ.సంజీవ్ కుమార్ కోరారు. రైతుసేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సంజీవ్ కుమార్ కోరారు.

పేర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకో

● టీడీపీ నేతలు కనపర్తి, బాబాప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం బొక్కి దొరికిపోయిన పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. విజయవాడ సబ్ జైలు వద్ద మంత్రి కొల్లు రవీంద్ర తన వెంట్రుక కూడా పీకలేరని మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు చేయడంపై కనపర్తి శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ నేతలకు వెంట్రుకలు పీక్కోవటం బాగా అలవాటు అయిపోయిందన్నారు. గౌరవప్రదంగా మసలే కొల్లు రవీంద్రను కించపరిచేలా పేర్ని నాని మాట్లాడటం బలహీనవర్గాల పట్ల వైసీపీకి ఉన్న చులకలన అద్దం పడుతుందన్నారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : పేద ప్రజల బియ్యం బొక్కి ప్రభుత్వానికి మూల్యం చెల్లించిన మాజీ మంత్రి పేర్ని నాని ఇష్టారాజ్యంగా మంత్రి కొల్లు రవీంద్ర గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందని ము నిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ధ్వజమెత్తారు. టీడీపీ అసెంబ్లీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన కొల్లు రవీంద్రపై అవాకులు, చెవాకులు మాట్లాడే నైతిక హక్కు పేర్నికి లేదన్నారు. మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పేర్ని నాని దోచిన డబ్బుతోనే కొత్తపూడిలో కోట్లాది రూపాయలు విలువ చేసే గిడ్డంగి నిర్మించారన్నారు. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ బాషా, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, ఖాజా, లంకిశెట్టి నీరజ తదితరులు మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



వెంకటాపురంలో కుంకుమార్చన



పాగోలులో పూజావిధానం పుస్తకావిష్కరణ

మోపిదేవి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో వెంకటాపురం రామాలయంలో అర్చకులు కె.కుమార్ శర్మ విశేష కుంకుమార్చనలు జరిపారు. ధర్మప్రచారక్ గరికపాటి వీరాంజనేయులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బసవ శంకరరావు, సభ్యులు అరజా ఏడుకొండలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా ప్రతిష్ఠా పూజలు

చల్లపల్లి : పాగోలులోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాం గణంలో కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండప పూజలు, శ్రీచక్రార్చన, ధాన్యాధివాసం, హోమాలు విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదార శర్మ చేశారు. మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజలు జరిపారు. కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం గం.10.24 లకు ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుంది.

పూజావిధానం పుస్తకావిష్కరణ

కైవల్యాశ్రమ మందిర ప్రాంగణంలో కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన పూజావిధానం పుస్తకావిష్కరణ జరిగింది. విశాఖపట్నం సాయిగోకుల గురుదత్త విహార్ ఆశ్రమ పీఠాధిపతి సద్గురు సాయి సుధాకర పూర్ణానంద స్వామి పుస్తకావిష్కరణ చేశారు. అనుగ్రహభాషణ చేశారు. మేనే జింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు పాల్గొన్నారు. పడమర వీధి జెండు చెట్టు బజారులో రాఘవరపు వెంకట కృష్ణమ్మ జానకి రామాలయ ప్రతిష్ఠామహోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. హోమాలు, గ్రామోత్సవం, అధివాస పూజలు డాక్టర్ కనుమళ్ల రామకృష్ణశాస్త్రి, రూపరాజు విజయ్‌కుమార్ శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగాయి.

12 గంటల్లోనే బైక్ రికవరీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అపహరణకు గురైన బైక్‌ను 12 గంటల్లో చిలకలపూడి పోలీసులు రికవరీ చేసి యజమానికి అందజేశారు. సిబ్బందిని ఎస్పీ ఆర్. గంగాధరరావు అభినందించారు. కె.ఆంజనేయులుకు చెం దిన యమహా బైక్ అపహరణకు గురైంది. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయ గా, సీఐ నబి ఆధ్వర్యంలో వేగంగా దర్యాప్తు జరిపారు. అపరాల నూర్పిళ్లకు కొడాలికి వెళ్లిన బైక్‌లను పరిశీలించారు. పొలం వద్ద ఆంజనేయులు బైక్ ఉండటాన్ని గమనించారు. ఎస్సై సుబ్రహ్మణ్యం వేగంగా దర్యా ప్తు జరిపి బాధితుడు ఆంజనేయులుకు బైక్‌ను 12 గంటల్లోనే అప్పగించారు.

అన్నమయ్య సాహిత్యం అజరామరం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య సాహిత్యం అజరామరంగా నిలిచిపోతుందని ప్రముఖ సంగీత విద్వాంసులు జి. శ్రీనివాసరావు అన్నారు. మహతి కళావేదికపై నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య కీర్తనలపై శ్రీనివాసరావు ప్రసంగించారు. మేడిశెట్టి యోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, సాహితీ విమర్శకుడు ఎస్. వెంకటేశ్వరరావు, పోతురాజు, భవిష్య, బాలాజీ పాల్గొన్నారు.

సారా స్వాధీనం

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ అధికారులు శనివారం శారదాయిపేటలో శనివారం దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా స్వాధీ నం చేసుకుని, మహిళపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ, సిబ్బంది వసంత్, వినోద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 465

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కూచిపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గం ధ్యేయంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మొవ్వ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజన్ ఉదయ్ ప్రకాష్ తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ పడదగిన క్రిమినల్, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. ఈ అంశాలకు సంబంధించి మొవ్వ కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో ఆయన చర్చించారు.



పోలీసు అధికారులతో చర్చిస్తున్న న్యాయాధికారి రాజన్ ఉదయ్ ప్రకాష్

ఓటర్లకు స్లిప్‌లను ఇంటివద్దకే అందించాలి

● ఐద్వా కార్యదర్శి రజిని

గుడివాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్లిప్‌లను సచివాలయ సిబ్బంది నేరుగా ఓటర్‌లకు అందించాలని ఐద్వా డివిజన్ కార్యదర్శి పి.రజిని కోరారు. సుందరయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటర్‌లకు స్లిపులు వచ్చాయని ఫోన్‌లో సమాచారం అందించి, సచివాలయానికి వచ్చి తీసుకువెళ్లాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్‌లకు స్లిప్పులను అందించాలని డిమాండ్ చేశారు.

మొవ్వ మండలంలో 1259 మంది

కూచిపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొవ్వ మండలంలో 1259 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల ద్వారా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీరు, ర్యాంప్ సౌకర్యం మొదలగు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మస్తాన్ తెలిపారు.

గుడ్లవల్లేరు మండలంలో 1481 మంది

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో 1481 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కేంద్రాలను సిద్ధం చేసే పనుల్లో అధికారులు ఉన్నారు. గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం హైస్కూల్ ప్రాంగణంలో బూత్ నెంబర్లు 169, 170లో పోలింగ్ జరుగనుంది.

పామర్రు నియోజకవర్గంలో

పామర్రు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పామర్రు నియోజకవర్గంలో జరిగిపోతున్నాయి. ఐదు మండలాల్లో ఏర్పాటు చేసిన తొమ్మిది పోలింగ్ కేంద్రాల ద్వారా మొత్తం 6447మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పామర్రు కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలు, మొవ్వ మండలంలో రెండు, తోట్లవల్లూరులో రెండు, పమిడిముక్కల మండలంలో రెండు, పెదపారుపూడి మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.





ప్రచారంలో పాల్గొన్న కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు.. 11వ వార్డులో..

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

గుడివాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోరుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం సత్యనారాయణపురంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని, ఆలపాటి లాంటి వ్యక్తిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నిమ్మగడ్డ కృష్ణారావు, సిద్ధార్థ పాఠశాల ప్రిన్సిపాల్ చోడవరపు విజయ్‌కుమార్, కేవీ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్ము వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.11వ వార్డులో ఆలపాటి గెలుపు కోరుతూ నాయకులు సయ్యద్ జబీన్, ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్‌లు శనివారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు శనివారం 22, 29, 30, 31, 32, 33, 34 వార్డులో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర పెరిక సాధికారిక సభ్యులు రామదేను వేణుబాబు, మూడెడ్ల శ్రీధర్, కోడూరు ప్రభు, చందు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

లక్ష్మణరావుకు దళితవర్గాలు అండగా నిలవాలి : పొంగులేటి

గుడివాడ : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎస్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావుకు దళితవర్గాలు అండగా నిలిచి గెలిపించాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు కోరారు. గౌరీశంకరపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు.

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించాల బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురారి నగేష్ కోరారు. బంటుమిల్లిరోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గుమ్మా శ్రీనివాస్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి కూచిపూడి వాసుదేవ రావు, మహిళ అధ్యక్షురాలు కుంభం నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఐలూరు రామేశ్వరస్వామి దేవస్థానాన్ని పరిశీలిస్తున్న కాకినాడ డీసీ రమేష్‌బాబు, గన్నవరం ఇన్‌స్పెక్టర్ అనురాధ

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఐలూరులో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, భక్తులు సంతోషంగా దైవదర్శనం చేసుకునే విధంగా బారికేడ్లు నిర్మించాలని కాకినాడ దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి.రమేష్‌బాబు ఆదేశించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానాన్ని శనివారం డీసీ రమేష్‌బాబు సందర్శించారు. ముందుగా రామేశ్వరస్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ పరిసరాలను, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇచ్చే ప్రసాదాలు నాణ్యంగా చేయించాలని, అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. గన్నవరం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఈవో శివ గోపాల్, రాజగోపాల్ పాల్గొన్నారు.



అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఏసురత్నం

నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు

పరిశీలించిన జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం

గుడివాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : నేషనల్ బిల్డింగ్ కోడ్, రాష్ట్ర ఫైర్ యాక్టు ప్రకారం షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనలు పాటించడం లేదన్న ఫిర్యాదు మేరకు, జిల్లా అగ్నిమాపక అధికారి డి.ఏసురత్నం శనివారం ఏలూరురోడ్డులోని డీవీఎస్ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేపట్టారు. భవనం కొలతలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఎంత మేరకు ఉన్నాయి, అగ్ని ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు మెట్లు, వాటి కొలతలను తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు తెలిపారు. తనిఖీల్లో అగ్నిమాపక సిబ్బంది, కాంప్లెక్స్ యజమానులు పాల్గొన్నారు.



ముస్తాబైన అమ్మవారి ఆలయం

3 నుంచి గంగానమ్మ జాతర

పామర్రు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పామర్రు గంగానమ్మ జాతర మహోత్సవాలు వచ్చేనెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్నట్లు జాతర ఉత్సవ కమిటి శనివారం తెలిపింది. తొలి రోజు అమ్మవారికి 108 బిందెల చెరువునీటితో అభిషేకించి, పంబలవారు ప్రత్యేక పూజాలు, అమ్మవారి కథ వినిపించటంతో జాతర మహోత్సవానికి అంకురార్పణ జరుగుతుంది. గ్రామదేవతగా భక్తులచేత నీరాజనాలు అందుకునేందుకు అమ్మవారి ఘటం, పోతురాజు గెడలతో ఆలయం నుంచి ఊరేంగింపుగా బయలుదేరి సంప్రదాయంగా జమ్మి చెట్టు సెంటర్‌లోని గ్రామ పూర్వపు మునసబు వంశీస్తులైన బొమ్మారెడ్డి మధుసూదనరెడ్డి ఇంటి నుంచి చల్ది నైవేద్యాన్ని ఘటంలోకి స్వీకరిస్తారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు.

పోలీసుల పల్లెనిద్ర

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాటూరులో శుక్రవారం రాత్రి పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. కంకిపాడు సీఐ జె మురళీకృష్ణ గ్రామస్థులతో మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, జూదం, గంజాయి, మత్తుపదార్థాల సమాచారం అందించి పోలీసులకు గ్రామస్తులు సహకరించాలన్నారు. రూరల్ ఎస్సై కె సురేశ్ బాబు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పిల్లలకు కాచి చల్లార్చిన నీటినే ఇవ్వాలి

పెదపారుపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జ్ఞానజ్యోతి శిక్షణ ఎంఈవో-2 సురేష్ అధ్యక్షతన జరిగింది. అంగన్వాడీ కార్యకర్తలను కేంద్రంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే పిల్లలకు ఇవ్వాలని సూచించారు. ట్రైనింగ్‌లో ఆర్పీలు శివశంకర్, శ్రీదేవి, నాగజ్యోతి, అరుణకుమారి, శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.



పెదపారుపూడి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన జ్ఞానజ్యోతి కార్యక్రమంలో అంగన్వాడీలు

చిత్తశుద్ధితో పనిచేయాలి

ఏపీఎంలు, సీసీలకు డీఆర్‌డీఏ పీడీ సాయిబాబు దిశానిర్దేశం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపులు లీడర్లు సక్రమంగా పనిచేయటానికి ఏపీఎంలు, సీసీలు చిత్తశుద్ధితో పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ సాయిబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో కంకిపాడు, గుడివాడ క్లస్టర్ల ఆధ్వర్యంలో 13మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోలకు మూడు రోజుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో యూనిట్‌గా తీసుకుని మహిళలు ఎంతమంది ఉన్నారో ముందుగా తెలుసుకోవాలన్నారు. చేరని మహిళలను గుర్తించి వారిని కూడా డ్వాక్రా గ్రూపుల్లో చేర్పించాలని ఆదేశించారు. గ్రామ సమాఖ్య లీడర్ గ్రూపు లీడర్లతో ఎప్పటికప్పుడు వారి ఆర్థిక విషయాలు సక్రమంగా పని చేయటానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఐ.బి. నర్రా భాను మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులకు ప్రతీ ఫోన్ ఆన్‌లైన్ చేయించాలన్నారు. శిక్షణ తీసుకున్న వారు ప్రతీ గ్రామానికి వెళ్లి వివిధ అంశాలపై డ్వాక్రా గ్రూపు సభ్యురాలకు అవగాహన కల్పించాలన్నారు. మచిలీపట్నంలో, చల్లపల్లిలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయిబాబు

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మనోరంజని

పామర్రు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత లక్ష్యాలను విద్యార్థులు చేరుకోగలరని పాఠశాల పూర్వ విద్యార్థిని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బట్టు మనోరంజనీ అన్నారు. పామర్రు కంచర్ల రామారావు జిల్లా పరిషత్ 99వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మనోరంజీ మాట్లాడుతూ, సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలిచేలా నడుచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులతోపాటు గురువులకు, ఆ పాఠశాలకు, పుట్టిన జన్మ భూమికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే ఈ పాఠశాలలో గురువుల ప్రోత్సాహంతోపాటు వారు నేర్పిన విద్యాబు ద్ధులేనన్నారు. మరో అతిథి జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ, ఎందరో రాజకీయనేతలతోపాటు మేటి విద్యా వంతులుగా తీర్చిదిద్దిన చరిత్రగల ఈ పాఠశాల వార్షికోత్సవంలో విద్యాశాఖ అధికారిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కాలా నికి అనుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు. త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. వార్షికోత్స వంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారిణి పద్మారాణి, ఎంఈవో పద్మావాణి, పాఠశాల హెచ్‌ఎం ఆలపాటి ఇందిరరాణి, సీఐ విశుభకర్, పాఠశాల అభివృద్ధి కమిటి ఛైర్మన్ వల్లూరిపల్లి చక్రవర్తి, కార్యదర్శి బొమ్మారెడ్డి కోటిరెడ్డి, సీడీపీవో భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సభావేదికపై మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ మనోరంజని



రోడ్డుపై గుంతలు పూడుస్తున్న బీజేపీ నాయకులు

గుంతలు పూడ్చివేత

గుడివాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీకి వెళ్లే రహదారిలో ఏర్పడ్డ గుంతలను బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పూడ్చినట్లు టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) తెలిపారు. మల్లాయి పాలెం శివారు టిడ్కో కాలనీలో తమ వంతుగా శనివారం గుంతలు పూడ్చినట్లు తెలిపారు. నాయకులు లంకా రాం బాబు, గాదే కిరణ్, టిడ్కో కాలనీ వాసులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో స్వచ్ఛాంధ్ర

గుడ్లవల్లేరు : స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ తడి, పొడి చెత్తను వేర్వేరు చేసే విధానం, ఆకుపచ్చ, బ్లూ, ఎరుపు రంగు డబ్బాలను ఏర్పాటు చేసుకొని ఏరంగు డబ్బాలో ఏ వ్యర్థాలు వేయాలి అనే అంశంపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను సిబ్బంది పంపిణీ చేశారు.

మినుము పైరు పరిశీలన

కలుపు నివారణపై శాస్త్రవేత్తల సూచనలు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మినుములో కలుపు నివారణకు మందులు వాడినా తగ్గలేదని వ్యవసాయాధికారులకు ఫిర్యాదు మేరకు పైరును పరిశీలించామని ప్రిన్సిపల్ సైంటిస్ట్ లామ్ ఫామ్ ప్రతిభాశ్రీ అన్నారు. మోటూరుకు చెందిన కొందరు రైతులు ఈ నెల మొదటి వారంలో కలుపు నివారణకు సూచనలు కోరారన్నారు. ఆర్‌ఎస్‌కే సెంటర్ వద్ద సమావేశం నిర్వహించారు. మినుము మొక్కలు ఏ సమయంలో ఉన్నప్పుడు కలుపు నివారణకు పిచికారి చేశారు, ఎకరాకు ఎంత మంది ఎన్ని డోసులు, ఎన్ని క్యానులు వాడారో తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. ఉయ్యూరు ఆర్‌ఎస్‌ఆర్ సీనియర్ శాస్త్రవేత్త విజయభాస్కర్ రెడ్డి, ఘంటసాల ఏఆర్‌ఎస్ సీనియర్ సైంటిస్ట్ జె.పద్మావతి ఏవో బోలెం అనంతలక్ష్మి, రైతు గరికపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.



మినుము పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు